క్లుప్తంగా

రోడ్డు, ప్రహరీ నిర్మాణాలకు వినతి

మాకవరపాలెం: శ్మశాన వాటికకు ప్రహరీ, రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయా లని బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో అంత్య క్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డు, ప్రహరీ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని విన్నవించారు.

భక్తిశ్రద్ధలతో సంతోషిమాత ఉద్యాపన



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఉద్యాపన కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. గోమాతను పూజించారు. పాడేరుకు చెందిన కాంట్రాక్టరు పరిటాల నాగేశ్వరరావు, గంగాభవానీ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత ముఖ్యం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: వసతి గృహాల్లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. శుక్రవారం స్థానిక గురుకుల కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 130 మంది విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీనివల్ల వ్యాధులు సోకవని చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం మానుకోవాలి



పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం మానుకోవాలని ఎంఈవో మూర్తి తెలిపారు. ప్రపంచ పేపర్ బ్యాగ్స్ దినోత్సవాన్ని శుక్రవారం బి.ఎస్.పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్‌లతో పర్యావరణానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వాటిని పక్కన పెట్టి పేపర్ బ్యాగ్‌లను వాడాలని కోరారు. ఉపాధ్యాయులు సామ్రాట్‌అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ ఎం. అప్పలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో హెచ్.ఈ.సి, బై.పి.సి, ఎం.పి.సి, సి.ఈ.సి గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ అధ్యక్షుడి వ్యాఖ్యలు హాస్యాస్పదం

మాడుగుల రూరల్: బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఉండూరు రాజు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సాలాపు వీరునాయుడు శుక్రవారం తెలిపారు. ఈ నెల 9న ఎమ్మెల్యే, అధికారుల సమీక్షా సమావేశానికి తనకు ఆహ్వానం లేదని చెప్పడం తగదన్నారు. ఎన్నికల తర్వాత రెండు సార్లు జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశానికి రాజు హాజరు కాలేదన్నారు. ఎన్నికల్లో బూత్‌లకు నగదు సక్రమంగా ఇవ్వలేదని, ఈ కారణంగా పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించారన్నారు. కొత్త అధ్యక్షుడు నియామకం జరుగుతుందన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

ట్రిపుల్ ఐటీకి 11 మంది విద్యార్థుల ఎంపిక



ఆళ్ల ఉదయశ్రీ



బుద్ధ పరిమళ

చోడవరం నుంచి ఐదుగురు

చోడవరం: ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. చోడవరం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థినులు ఎం. నేహా, జి. నాగలక్ష్మి, టి. లీలాసాహిత, వై. యశ్వంతి, ఎస్. కల్పన ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఐ.వి. రామిరెడ్డి చెప్పారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు వీరు ఎంపికయినట్టు ఆయన తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దేవరపల్లి కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

నర్సీపట్నం నుంచి ఇద్దరు

నర్సీపట్నం: మహాత్మ గాంధీ జ్యోతీబాపూలే గురుకుల బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి అభినందించారు. పైల యశ్వంత్ ఒంగోలు, ఆర్.నిఖిల్‌వర్మకు నూజివీడులోని ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చినట్టు చెప్పారు. వీరిని ఆయనతోపాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కె.జె.పురం హైస్కూలు నుంచి ఇద్దరు

మాడుగుల రూరల్: కె.జె.పురం జెడ్పీ హైస్కూలు నుంచి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం వి. దాసు శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో ఆళ్ల ఉదయశ్రీ 583 మార్కులతో నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. తాజాగా నూజివీడు, 571 మార్కులు సాధించిన బుద్దా పరిమళ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ నెల 22వ తేదీ నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కానున్నారు. వీరిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్, సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్



విద్యార్థి కరీంకు ప్రోత్సాహకం అందిస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట నుంచి ఇద్దరు

రోలుగుంట: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవో జాను ప్రసాద్ తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.కె. సయ్యద్ అన్సారీ కరీం, బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.హరీష్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరికి ఎంఈవో-2 జగ్గారావు, హెచ్‌ఎంలు డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, శేఖర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి ఎస్.కె. సయ్యద్ అన్సారీ కరీంకు హెచ్‌ఎం డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్ వాచ్‌ను బహూకరించారు. సోషల్ టీచర్ ఆర్.వి.ఎస్.ఆర్ శర్మ రూ.2 వేలు, తెలుగు టీచర్ సునీత రూ.వెయ్యి పోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కరీంను ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి పాల్గొన్నారు.



ఎస్. కల్పన



వై. యశ్వంతి



జి. నాగలక్ష్మి



ఎం. నేహా



హరీష్



లీలాశాంతి

డీఈవో వెంకటలక్ష్మమ్మ అభినందన



రామారావును దుశ్శాలువాతో సన్మానిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కె.కోటపాడు: పాడుగుపాలేనికి చెందిన రామారావు తన తల్లి దొగ్గ మల్లమ్మ పేరిట చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎ.కోడూరు కేంద్రంగా దొగ్గ రామారావు 11 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పాడుగుపాలెం, ఎ.కోడూరు, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, ఆర్.వై.అగ్రహారం, కొత్త అగ్రహారం, వారాడ, ఎ.భీమవరం, కింతాడలో విద్యార్థులకు ఏటా విద్యా సామగ్రి పంపిణీ చేస్తుండటంతోపాటు ఎ.కోడూరు వసతి గృహంలో రగ్గులను అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోకం ఎర్రునాయుడు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటిస్తే రోగాలు దూరం



సరుగుడులో రోగులను పరీక్షిస్తున్న నాతవరం వైద్యాధికారి రాజేష్‌నాయుడు



ఎం.బి.పట్నంలో రోగులను పరీక్షిస్తున్న గునుపూడి వైద్యాధికారి చక్రధర్ బలిజి

నాతవరం: వైద్యుల సూచనలు పాటిస్తే చాలా వరకు రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎం.రాజేష్ నాయుడు, చక్రధర్ బలిజి తెలిపారు. నాతవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సరుగుడులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ 129 మందిని, గునుపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎం.బి.పట్నంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియాతోపాటు డయేరియా సోకకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో జ్వరాలు నివారించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అందులో భాగంగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు విస్తృతంగా సదస్సులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చక్రధర్‌బలిజి

నాతవరం: డెంగ్యూ నివారించేందుకు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.చక్రధర్ బలిజి తెలిపారు. శుక్రవారం గునుపూడిలో డెంగ్యూ, మలేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తర్వాత హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సమయంలో నిర్లక్ష్యం వహిస్తే ఆరోగ్యం దెబ్బతిని చదువుపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. ఏమాత్రం చిన్న సమస్య వచ్చినా వెంటనే గునుపూడి పీహెచ్‌సీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చిటికెల అనూష్, ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక పోషకాలున్న పశుగ్రాసంతో పాల దిగుబడి



దిబ్బిడిలో రైతులకు గడ్డి పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు

బుచ్చెయ్యపేట: పాడి పశువులకు పోషకాలున్న పశుగ్రాసాన్ని అందించడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఆయన శుక్రవారం దిబ్బిడిలో రైతులు పెంచుతున్న పశుగ్రాసాలను పరిశీలించారు. సియాద్రి నాయుడు కల్లాల వద్ద పాడి పెంపకం, పశుగ్రాసాలు పెంపకం, అధిక పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. చాలా మంది రైతులు పశుగ్రాసాలు పెంపకంపై దృష్టి సారించకుండా ఇళ్ల వద్ద, కల్లాల వద్ద కట్టేసి దాణాలు ఉడికించి పెడుతున్నారన్నారు. దాణా వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయన్నారు. కొద్దిపాటి పొలంలోనే మేలు రకం రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, అలసంద, పిల్లి పెసర, కాకిజొన్న తదితర రకాల పశు గ్రాసాలను సాగు చేసుకోవాలన్నారు. ఒకసారి గడ్డి నాటితే చాలని, కోసే కొద్దీ పుడుతుందన్నారు. నేపియర్ ముచ్చులు, విత్తనాలను రైతులకు ఉచితంగా అందించారు. వైద్యాధికారి ఉమామహేశ్వరి, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, సిబ్బంది పి. నాగేశ్వరరావు, సత్యనారాయణ, గోపాలమిత్ర మణికంఠ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎం. కోటపాడులో 89 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: ఎం.కోటపాడులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యాధికారి కె. లీలాప్రసాదు 89 మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఎ.ఎన్.ఎం పుష్ప, ఆరోగ్య సహాయకు లు శంకర్, ఎం.ఎల్.హెచ్.పి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రివలసలో 119 మందికి

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగు లేకుండా ప్రతీ ఫ్రైడేను డ్రైడేగా ప్రజలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. శుక్రవారం మర్రివలసలో 119 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించుకోవడంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి. అరుణ, హెచ్.వి.భాగ్యలక్ష్మి, ఎ.ఎన్.ఎం.స్వాతి, నర్సింహామూర్తి పాల్గొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శైలజ

మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలి



విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఈవో -2 వరహాలబాబు

నాతవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. స్థానిక సన్‌సైన్ పాఠశాల కరస్పాండెంటు అరవ సునీల్ సమకూర్చిన 300 మామిడి, జీడి మొక్కలను శుక్రవారం ఎంఈవో విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అశోక్ చక్రవర్తి లాంటి మహనీయుల ఆశయ సాధనకు మనమంతా పాటు పడాలన్నారు. చెట్లు పెంచడం వల్ల ఆదాయంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. గతంతో పోల్చుకుంటే అడవులు చాలా వరకు అంతరించిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు తగ్గిపోతే కలిగే నష్టాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా పాఠశాల ప్రాంగణంలో ఖాళీ స్థలంలో వివిధ జాతుల మొక్కలు నాటేందుకు దృష్టి సారిస్తామన్నారు. కరస్పాండెంటు అరవ సునీల్‌ను అభినందించారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నర్సీపట్నం: పట్టణంలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా గొలుసు శ్రీనివాసరావు, కార్యదర్శిగా సుతాపల్లి చైతన్యకుమార్, కోశాధికారిగా వినోద్ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా లయన్ డాక్టర్లు రాఘవేంద్రరావు, గోపాలరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా లయన్ వెలగా నారాయణరావు వృద్ధురాలికి ట్రై సైకిల్ అందజేశారు. లయన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, లయన్ డాక్టర్ రామకృష్ణ, లయన్ చెరుకూరి సతీష్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కుల ధ్రువీకరణకు గోడగలి కులస్తుల ధర్నా



రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గోడగలి కులస్తులు

చోడవరం: రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం గోడగలి కులస్తులు ధర్నా చేశారు. కొత్తకోట గ్రామానికి చెందిన తమకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వాపోయారు. ఎస్సీ ఉప కులంగా 2023 వరకూ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం వాటిని రెన్యువల్ చేయాలని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే, ఎస్సీలో ఉపకులంగా ఆన్‌లైన్లో ఆప్షన్ చూపించడం లేదని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రమణారావుకి వినతిపత్రం ఇచ్చారు.

మోదమ్మ పాదాల పండగ రేపు



మోదమ్మ పాదాలను దర్శించుకుంటున్న వర్తక సంఘ సభ్యులు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాల పండగ ఆదివారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆషాఢ మాసం సందర్భంగా జంక్షన్‌లో భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన 108 ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొంది. ఈ మేరకు వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, ఆటో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పరశురామావతారంలో జగన్నాథుడు



పరశురామావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న దృశ్యం

మాడుగుల: జగన్నాథ రథయాత్రలో భాగంగా శుక్రవారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్నం వద్ద కొలువైన స్వామివారికి తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం హరి భజన కార్యక్రమం నిర్వహించారు.

శాకంబరిగా దుర్గాలమ్మ



దుర్గాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్: ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం ఎం. కోడూరులో గ్రామదేవత దుర్గాలమ్మను శాకంబరీ దేవిగా అలంకరించారు. అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై చర్యలు

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు



అధికారులను హెచ్చరిస్తున్న బండారు

చీడికాడ: ప్రజలకు అందుబాటులో లేని ఏ శాఖ అధికారులైనా చర్యలు తప్పవని ఎమ్మెల్యే బండారు సత్యానారాయణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, వైద్యం తదితర శాఖలపై సభ్యులు అధికారులను నిలదీశారు. కోనాం, వి.బి.పేట, దిబ్బపాలెం, మంచాల తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తీవ్రంగా ఇబ్బంది ఏర్పడుతున్నట్లు, సచివాలయ లైనుమెన్లు హెడ్ క్వాటరులో ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు సభలో ప్రస్తావించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో లేకుంటే వారిని సస్పెండ్ చేయిస్తామని హెచ్చరించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, ఎంపీడీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వాకపల్లిలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



వాకపల్లి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్. అప్పలరాజు

దేవరాపల్లి: గ్రామాల్లా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు సచివాలయాల్లో పౌర సేవలను పారదర్శకంగా అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అప్పలరాజు గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. వాకపల్లి గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జి ఈవోపీఆర్డి జి. సంతోషి నళినితో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి, పైపులైన్లకు లీకేజీలు లేకుండా సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. డ్రైనేజీలను పరిశీలించి ఎప్పటికప్పుడు పూడికలను తొగించాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట పంచాయతీ సెక్రటరీ బి. సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కె.కోటపాడు: వారాడ సబ్ స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం వారాడ, ఆర్.వై.అగ్రహారం, కొరువాడ, పింద్రంగి, డి.అగ్రహారం, పోతనవలస, ఆనందపురం, వి.సంతపాలెం, గవరపాలెం, కె.జె.పురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందన్నారు.

మాకవరపాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గిడుతూరు, లచ్చన్నపాలెం ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలకృష్ణ తెలిపారు. లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గిడుతూరు, బయ్యవరం, పి.పి.అగ్రహారం, బి.ఎస్.పేట, ఎన్.జి.ఆర్.పి.అగ్రహారం, జంగాలపల్లి, నారాయణరాజుపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

దేవరాపల్లి: స్థానిక సబ్ స్టేషన్‌లో పరిధిలో శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె. శంకరరావు తెలిపారు. యార్డు మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా కౌలు రైతుకార్డుల మంజూరు

ఏఈవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఏఈవో కిరణకుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ

దేవరాపల్లి: కౌలు రైతుకార్డులు మంజూరు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ జి. లక్ష్మీనారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వ్యవసాయ సహాయకులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దారు సూచించారు. వీఆర్వో లాగిన్‌లో కౌలు రైతు కార్డులు దరఖాస్తులకు అవకాశం కల్పించారన్నారు. సెంటు సొంత భూమి లేకుండా కౌలుకు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు కౌలురైతు కార్డులు పొందేందుకు అర్హులన్నారు. భూమి యజమాని పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్, కౌలుదారు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకంతోపాటు పది రూపాయల రెవెన్యూ స్టాంప్ పేపర్‌పై 11 నెలల సాగు ఒప్పందం ధ్రువీకరణ పత్రాన్ని వీఆర్వోకు అందజేయాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com